# హెచ్చరిక! ముందు - దాగియున్న బండలున్నాయి జాగ్రత్త! (4:32-5:14)

యూదా తన పత్రికలో వివిధ రూపక అలంకారాలను ఉపయోగించాడు. కొన్ని యేండ్ల క్రిందట వాటిలో ఒకటి నా దృష్టిని ఆకర్షించింది: ''... మీ ప్రేమ విందులలో (వారు దొంగమెట్టలు) దాగియున్న బండలుగా ఉన్నారు''[1] (12 వ.; ASV). ప్రేమ విందులంటే ఏమో నాకు తెలుసు. అవి ఆది క్రైస్తవుల[2] సహవాస భోజనాలు. దాగియున్న బండలను నేను రాళ్లనుకొని, అవి భోజనంలో తగిలే రాళ్లనుకొన్నాను. చిక్కుళ్లు[3] గిన్నెలో రాళ్లు తగలడం నాకు తటస్థించినందున హేంబర్గర్స్‌లో కూడ నాకు కొన్నిరాళ్లు తగిలినందున - ఆ ఉదాహరణ సరియైనదేయన్నట్టు నేను తలంచాను. ఇలాటి ఎదురుచూడనిది ఏదైనా మంచి భోజనాన్ని పాడుచేయవచ్చు - క్రీస్తునందున్న మన సహవాసాన్ని అబద్ధబోధలు అలాగే పాడుచేయవచ్చు.

''దాగిన రాళ్లు'' అని నేను చేసిన వ్యాఖ్యానం తేటగా ఉన్నా, అది తప్పే. భూమితో చుట్టబడియున్న ''ఓక్లహోమా''లో నేను పెంచబడకపోయి యున్నట్టయితే, నాకు అర్థం బాగా తెలిసియుండేదే. సముద్ర ఉపరితలం క్రింద దాగియున్న బండలను ఆ ప్రయోగం సూచించినట్టు తరువాత నేను తెలిసికొన్నాను. నౌకాయానానికి అలా దాగియున్న బండలు ఆపద కలిగించేవిగా ఉంటాయి. NASB - ''దాగినమెట్టలు'' అని తర్జుమా చేసింది. పౌలుయొక్క రోమా ప్రయాణంలో దాగియున్న మెట్టలవలననే ఆ ఓడకు ఉపద్రవం కలిగింది (27:41). శతాబ్దాల తరబడి జరిగిన నౌకాయానంలో, లెక్కింపలేనన్ని ఓడలు ఈ దాగియున్న మెట్టలవలన కూల్చివేయ బడ్డాయి.[4]

అపొ. 4 చివర, 5 ప్రారంభంలో చదువుతూ ఉంటే, యూదా12లోని రూపక అలంకారం జ్ఞాపకం వచ్చింది. 1 నుండి 3 అధ్యాయాలవరకు సంఘం తేటగా పయనించింది.[5] 4వ అధ్యాయంలో హింస అనే తుఫాను చెలరేగింది. అయితే సహోదరులు ఆ తుఫానును తట్టుకొని బయటపడ్డారు. అధ్యాయం 5 లోనైతే, ''దాగియున్న భయంకరమైనమెట్టలున్నాయి'' - ఈ దాగిన మెట్టలు

సంఘాన్ని నాశనం చేయగలవు.

## తేటైన ఆకాశం (4:32-37)

శ్రమపెట్టబడిన తరువాత, తేటైన ఆకాశం, అనువైన గాలులతో సంఘ ప్రయాణం దీవించబడింది. 2:32-37లో ప్రారంభమైన ప్రేమ, నమ్మకత్వం, దాతృత్వం - అనే పరిస్థితులు 4:43-47వరకు కొనసాగినట్టు లూకా తన కథనంలో సూచించాడు. సిలువ నీడలో అపొస్తలుల బోధద్వారా తనయందు విశ్వాసముంచే వారందరు ఏకమైయుండాలని ప్రభువైన యేసు తండ్రియైన దేవునికి ప్రార్థించారు గదా? (యోహాను 17:20-21). ఆ ప్రార్థన సంఘారంభ దినాల్లో జవాబు పొందింది.[6] ''విశ్వసించినవారందరు ఏక హృదయమును ఏకాత్మయు గలవారైయుండిరి'' (32a వ.).[7] ''సంఘం'' అనే మాటకు అక్షరార్థం ''జనసమూహం''[8] అని. వారు అనేకులులా కన్పించారు గాని, నిజంగా వారు ఏకమైయున్నారు. క్రీస్తునందు వారికున్న ఏక బాంధవ్యాన్నిబట్టి వారు ఏకమైయున్నారు!

వారి ఐక్యత - త్యాగపూరితమైన దాతృత్వంగా పరిణమించింది:

> ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు; వారికి కలిగిన దంతయు వారికి సమిష్టిగా ఉండెను, ఇదియుగాక అపొస్తలులు బహుబలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చిరి. దైవకృప అందరియందు అధికముగా ఉండెను. భూములైనను ఇండ్లయినను కలిగినవారందరు వాటిని అమ్మి, అమ్మిన వాటి వెల తెచ్చి అపొస్తలుల పాదములయొద్ద పెట్టుచువచ్చిరి. వారు ప్రతివానికి వానివాని అక్కర కొలది పంచిపెట్టిరి గనుక వారిలో ఎవనికిని కొదువలేకపోయెను (32b, 35 వచ.).

''కావున నేడు నేను నీకాజ్ఞాపించుచున్న యీ ఆజ్ఞలనన్నిటిని అనుసరించి నడుచుకొనుటకు నీ దేవుడైన యెహోవా మాటను జాగ్రత్తగా వినినయెడల మీలో బీదలు ఉండనే ఉండ'' రని దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దానం చేసిన మాటవాస్తవమే (ద్వితీయో. 15:4-5). ఇశ్రాయేలీయులు ఆయన షరత్తులలో నిలువలేదు గనుక, వారు ఆ వాగ్దానాన్ని పొందలేకపోయారు. కడాపటికి, ఆత్మసంబంధమైన ఇశ్రాయేలీయులుగా, దేవుని ప్రజలు ఆయన చిత్తాన్ని జరిగించడానికి తమ్మునుతాము అప్పగించుకొన్నారు. అందువలననే, ''వారిలో ఎవనికిని కొదువలేకపోయెను'' అనే వింతైన సంగతిని చదువుతాం.[9] ఇలాటి ఆదర్శమైన స్థితిని నెలకొల్పాలని అనేక సమాజాలు ప్రయత్నించాయి. పేదరికం ఉన్నచోట, ఎక్కువగా ప్రభుత్వపు కార్యకలాపాలు కావాలని జనులంటారు. అయితే- మనకు క్రీస్తువంటి స్వభావం దీనికి అవసరమని లూకా అంటాడు.

ఇలాటి పరిస్థితి ఎలా సాధ్యమయ్యిందంటే: ''ఎవడును తనకు కలిగినది తనదని అనుకోలేదు.'' లోకంలోనికి ఒక శిశువు జన్మించిన తరువాత, తాను మొదటగా

నేర్చుకొనేవాటిలో మొదటిది ''నాది''[10] అనేదే! అయితే క్రొత్తగా జన్మించినవారు యిక్కడ మరచిన మాట ''నాది'' అనేదే! వారి ఆస్తులు, ''మనవి'' అంటూ, తమకు, తమ సహోదరులకు సంబంధించినట్లు వారు భావించారు. అంతకంటే ప్రాముఖ్య మయ్యింది: వారి ఆస్తులు ''ఆయనవి'': సమస్తం దేవునికి[11] చెందినవనీ; వారు కేవలం గృహనిర్వాహకులు మాత్రమేయని; వారు తలంచినట్లున్నారు. తమకు సొంతమై యున్నవాటిలో, దేవునికి కొంత కావాలన్నా అంతా కావాలన్నా- ఆయన పిల్లల పోషణ కొరకు అది వారికి సమస్యలేకుండానే ఉంది.

అయినా క్రైస్తవులందరు తమకు కలిగినవన్నీ వెంటనే అమ్మి ''సమిష్టి ధనంగా''[12] ఉంచినట్లులేదు. తమ సహోదర సహోదరీల అవసరతలను తీర్చడానికిగాను, వ్యక్తులు ఆయా సమయాల్లో తమ ఆస్తులను అమ్ముతూ వచ్చారు. NIVలో "from time to time'' అని ఉంది (అవసరం వచ్చునప్పుడెల్లా, అన్నట్లు).[13] ఒకని డబ్బు అయిపోయే సమయంలో, అవసరత వివరించబడితే, ఎవరో ఒకరు తమ ఆస్తులను అమ్ముతూ వచ్చారేమో! లేక వారు కూడిన సమయాల్లో - ప్రత్యేకమైన అవసరత ప్రకటింప బడిందనుకో, దగ్గర ఉన్నవారిలో ఎవరో ఒకరు వెళ్లి, ఆ అవసరతను పూడ్చడానికి గాను, తనకు కలిగినది అమ్ముతూ వస్తూ ఉండేవారేమో. ఇప్పటికి యిది చాలును అనే వరకు ఈ పని కొనసాగిందేమో![14]

వారు ఉపయోగించిన పద్ధతి ఎలాటిదైనా, వారు తమకు కలిగినవాటిని అమ్మి, అమ్మిన వెలతెచ్చి, అపొస్తులుల పాదాలవద్ద పెడుతూ వచ్చారు.[15] అలా వచ్చిన ధనాన్ని పంచడానికి తొలుత అపొస్తలులు బాధ్యత వహించారు. కాలక్రమంలో వారికి ఆ పని భారభరితంగా మారిపోయింది. అపొ. 6:1-4లో కన్పిస్తున్నట్లు వారికి సహాయం అవసరమైనట్లుంది.

అపొస్తలులు తమకు ఆజ్ఞాపించినందున, ఆది క్రైస్తవులు ఈ కార్యం చేయలేదు (5:4) గాని, ఒకరి యెడల మరియొకరికి కలిగిన ప్రేమ, అక్కరలను బట్టియే అలా జరిగింది! వారి దాతృత్వం అనుకోకుండానే ఉబికినట్లుంది. ప్రభువు సంఘంలో యిలాటి పరిస్థితిని చూచే భాగ్యం నీకు లభించిందో లేదో నాకు తెలియదు.[16] కలిమికలిగిన సమాజంలో నేను జీవించుచున్నందున, ప్రతివారుకూడా, అక్కర గలవారికి యివ్వాలనే భావంతోనే ఉంటున్నారు. అందునుబట్టి యిలాటి ధర్మకార్యం మామధ్య అవసరతలేకుండాపోయింది. నశించిన లోకానికి సువార్తను పంపడానికిగాను స్థానిక సంఘానికి సహాయం చేయబూని కొందరు తమ ఆస్తులను యిష్టపూర్వకంగా అమ్మి యిచ్చిన సంగతి నాకు తెలుసు. స్థానిక సంఘం అలాటివారి దాతృత్వాన్నికూడా అందుకుంది!

ఇలాటి పాలుపంపులుగల సందర్భంలోనే - ''అపొస్తలులు బహు బలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చిరి'' అని వ్రాయబడియుంది

(33 వ.). తొలి చూపులో ఈ వచనం అప్రస్తుత మన్నట్టు కన్పిస్తుంది. 31వ వచనం తరువాత బాగా అతికేలా అది గోచరిస్తుంది కాని తిరిగి ఆలోచిస్తే, సంఘంలోని ప్రేమ, దాతృత్వాల ఫలితాన్ని అది కనుపరచేందుకు అక్కడ పెట్టబడినట్టు కన్పిస్తుంది. సంఘ జీవితంయొక్క వర్తమానం, ప్రకటించే వర్తమానానికి శక్తినిస్తుంది. ఆది క్రైస్తవులు తమ వారిని ఆదుకొంటున్న తీరును క్రైస్తవేతరులు చూచినప్పుడు, వారు అపొస్తలుల బోధ వినే మనస్సును ప్రదర్శించినట్టున్నారు. క్రైస్తవులు క్రీస్తులా ఉండటంకంటే - సువార్తకు సహకరించగలిగేది ఏమీ ఉండదు. క్రైస్తవులు ఆయనవలె ఉండకుండ ఉండే దానికంటే - సువార్తను అంతగా బాధించేదికూడా ఏదీ ఉండదు. ''కృప'' అని తర్జువా చేయబడిన పదం మనుష్యుల దయను[17] సూచించియుండవచ్చు. అపొ. 2:47లో వలె **NEB**లో ''వారు ఎక్కువ ఘనంగా దృష్టింపబడ్డారు'' అని ఉంది.

క్రైస్తవులయొక్క దాతృత్వాన్నిగూర్చి సాధారణమైన వివరణ యిచ్చుకొంటూవచ్చి, లూకా కడకు ఒక ప్రత్యేకమైన ఉదాహరణను యిస్తున్నాడు:

> కుప్రలో[18] పుట్టిన లేవీయుడగు యోసేపు[19] అను ఒకడుండెను, ఇతనికి అపొస్తలులు హెచ్చరిక పుత్రుడు అని అర్థమిచ్చు బర్నబా అనే పేరు పెట్టి యుండిరి. ఇతడు భూమిగల వాడైయుండి దానిని అమ్మి దానివెల తెచ్చి[20] అపొస్తలుల పాదముల యొద్ద[21] పెట్టెను (36-37 వచ.).

కార్యగ్రంథంలో - బర్నబా అనే గొప్ప ''చిన్న పాత్రకు'' యిది మన పరిచయ భాగం. కార్యగ్రంథంలో - బర్నబా యిర్వైయైదు సార్లు ప్రస్తావించబడ్డాడు. పత్రికల్లో యింకా ఐదు సార్లు కన్పిస్తాడు. బర్నబా అనే పేరుకు అర్థమేమో లూకా తన పాఠకులకు తెలియజేశాడు. ''బర్'' అంటే - యొక్క[22] ''కుమారుడు'' అని భావం. అందువలన బర్నబా అంటే - ''ఉత్సాహపుత్రుడు''[23] అని అర్థం - లేక ఆదరణ[24] కుమారుడు, ఓదార్పు కుమారుడు[25] లేక హెచ్చరిక పుత్రడు[26] అని అర్థం. యోసేపు బర్నబా అని పిలువబడడానికి, సంఘాన్ని హెచ్చరించడంలో అతడు అందరికంటె మిన్నగా ఉన్నాడు కాబోలు. అతడు అలా చేసిన మాదిరి 11:23-24లో కన్పిస్తుంది. వ్యక్తులను అతడు హెచ్చరించి, బలపరుస్తున్నట్టు మనకు కన్పిస్తాడు. వ్యక్తులను అతడు బలపరచడం, నిలబెట్టడం - అపొస్తలులు కనుగొన్నప్పుడు, వారతనికి యిలా పేరుపెట్టియుంటారనుకుంటాను. అతడికి అలా పేరుపెట్టబడిన హేతువు ఏదైయున్నా, నేడు సంఘానికి అలాటి ''హెచ్చరిక పుత్రులు'' అవసరం.

ఈ ఔదార్యపు ఉదాహరణను మాత్రమే లూకా ఎందుకు తీసికొన్నాడో? ఈ వ్యక్తి గ్రంథంలో ప్రధానంగా కన్పించే వ్యక్తులలో ఒకడుగా కన్పిస్తాడు గనుక అతన్ని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఒకవేళ లూకా చేసియుంటాడేమో. లేదా, బర్నబాయొక్క కానుక ప్రత్యేకమైనందున యిలా జరిగిందేమో. అతడు లేవీయుడనే

విషయాన్ని లూకా ప్రత్యేకించి తెలిపాడు. పాలస్తీనాలో ఇశ్రాయేలు గోత్రాలవారికి భూమి పంపిణీ చేయబడినప్పుడు, లేవీయులకు వారితో భాగం పంచబడలేదు. లేవీయులకని కొన్ని పట్టణాలు మాత్రమే వేరుచేయబడి, వారికి అప్పగించబడ్డాయి. వారి జీవనం దేవాలయంమీద ఆధారపడి జరుగుతుంది.[27] లేవీయుడుగా, బర్నబా భూమిని సంపాదించడం అంత సులభమైన పనికాదు. గనుక దాన్ని వదలుకొనడం కూడా కష్టమైయుండవచ్చు.[28] బర్నబానుగూర్చి తెలపడంలో లూకా ఉద్దేశమేమై యున్నా, అతని కానుకకు తరువాత చెప్పబడిన కానుకకు చాలా వ్యత్యాసముంది.[29]

## దాగియున్న బండలు (5:1-11)

సంఘం ఏకంగా ఉంది; అభినందింపబడుతుంది; ఎదుగుతూ ఉందికూడా! అపవాది ఆ పరిస్థితిని సహింపలేకపోయాడు. సంఘాన్ని విడదీసి, అవమానపరచి, తగ్గించాలని వాడు తలపెట్టాడు[30] హింసించడం ద్వారా వాడు సంఘాన్ని వెలుపల నుండి పాడుచేయాలనుకున్నాడు (కుదరలేదు). ఇప్పుడు లోపలనుండి-నటనద్వారా అపవాది దాన్ని లయపరచజూస్తున్నాడు.

> అననీయ[31] అను ఒక మనుష్యుడు తన భార్యయైన సప్పీరాతో ఏకమై పొలమమ్మెను[32] భార్యయెరుకనే వాడు దాని వెలలో కొంత దాచుకొని కొంత తెచ్చి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టెను (5:1-2 వచ.).

సంఘంలోని పాపంగా దాఖలు చేయబడింది - అననీయ సప్పీరాల పాపమే. ఇది తొలిపాపమని కాదు. ప్రతి ఒక్కరు పాపం చేస్తారు (రోమా. 3:23). అయితే అది తొలిగా దాఖలు చేయబడిన పాపమైయుంది. అతని పేరు అననీయ - ''యెహోవా కృపగలవాడై యున్నాడు'' అని దాని భావం. దేవుని కృపాబాహుళ్యం అతనికి బోధింప బడింది. అతడు త్వరలోనే దేవుని న్యాయాన్ని నేర్చుకోబోతున్నాడు. అతని భార్యపేరు - సప్పీరా; అరామిలో దానికి సౌందర్యమని అర్థం. ఆమెకు అందమైన ముఖం ఉందేమో కాని; అందమైన ఆత్మ మాత్రం ఆమెకు లేదు. వారి పాపాన్ని మనం అర్థం చేసికొనడం ముఖ్యం. ఆస్తి కలిగియుండడమో, లేక దాన్ని అమ్మడమో వారి పాపంకాదు. (వారు తమ సొత్తును లాభానికి అమ్ముకున్నా, అందులో తప్పేమీలేదు). దానిలో కొంతసొమ్ము తమకొరకు ఉంచుకొనడంలో కూడా దోషమేమీలేదు. ఈ విషయాన్ని 4వ వచనం తేటపరుస్తుంది. అయితే యింతకు దోషమేమంటే - అమ్మిన దానిలో కొంతతెచ్చి, వారు అమ్మినదంతా అంతకేనని చెప్పి నటించడమే! (3, 8 వచ.).

అసలు ''వేషధారి'' అనేది - వేదికమీద నాటకం వేసేవానిని సూచించడానికి వినియోగింపబడే పదం. గ్రీకులు ఆ పదాన్ని దానికే వాడేవారు[33] ఆ దినాల్లో నటకులు ముఖాలకు ముసుకులు వేసికొనేవారు: హాస్యనాటకమైతే, నవ్వే ముఖంలాటి ముసుకు;

విషాదకరమైన నాటకమైతే, భీకరమైన ముఖపు ముసుకు తగిలించుకొంటూ ఉండేవారు. అయితే కాలక్రమంలో ఆ పదం - నాటికలో ఒక పాత్రను నటించేవానికి వర్తింపచేయబడింది. అటు తరువాత - తానేమైయున్నాడో అలా కానట్టు నటించేవానికి ఆ మాట ఉపయోగించబడింది (వేషధారులను గూర్చి ప్రభువు ఏమంటున్నారో మత్తయి 23లో చూడవచ్చు).

అయినా, ఒకడు తానేమైయుండాలో, కేవలం అలా ఉండకపోవడమే వేషధారణ కాదు. మనలో ఏ ఒక్కరూ తాను ఉండవలసిన తీరులో ఉండకపోవచ్చు. అయితే వేషధారణ అనేది - కావాలని చేసే మోసమే! అననీయ సప్పీరాలు వారి మోస చర్యను ముందుగా సంకల్పించుకొన్నారు. తమ సంకల్పం విషయంలో ఏకీభవించారు (9 వ.). వేషధారణ అనేది బుద్ధిపూర్వకమైన పాపం (హెబ్రీ. 10:26-29).

మోసగించాలని వారు ఎందుకు నిర్ణయించుకున్నారో, లూకా మనకు చెప్పలేదు. అయితే ''విద్యావంతుల ఊహను'' చేయవచ్చునట్లు[34] బర్నబా తన కానుకకు ప్రత్యేకమైన గుర్తింపుపొందాడు. (తన కానుకను బట్టి అతనికి మంచి బిరుదుకూడా లభించింది) గనుక తమకు కూడా అలాటి బిరుదు కావాలని అననీయ సప్పీరాలు వాంఛించియుండవచ్చు. ''మానసిక వ్యాధులన్నిటిలో పొగడ్తను ప్రేమించే అపాయ కరమైన అంటు జాడ్యంవంటిది మరేదీలేదు'' అని Sir Richard Steele అన్నాడు.[35]

వారు తమ పొలాన్ని అమ్మజూచినప్పుడు, వారి ధనాపేక్షతో, పొగడ్తకొరకైన వారి అభిలాషమోదుకుంది (1తిమోతి 6:10). వారి భూమికి మంచి వెలవచ్చియుండ వచ్చు. వారి పేరాశ దానినంతటిని యివ్వడానికి వారిని వదలనట్టుంది. బర్నబావంటి త్యాగం చేయకుండగనే, బర్నబాలాంటి పేరు పొందేది ఎలాగని వారు ఆలోచించి యుండవచ్చు. వారికి వచ్చిన సమాధాన మేమంటే - అమ్మిన వెలనుగూర్చి అబద్ధం ఆడితే సరిపోతుందనుకున్నారు ''పాపానికి పనిముట్లు చాలా ఉన్నాయి, అయితే అబద్ధమనే పిడి అన్నిటికి సరిపోతుంది'' అని Oliver Wendell Holmes ఒకసారి అన్నాడు.[36]

ఉబ్బెత్తుగా ఉన్న డబ్బు సంచితో అననీయ ఆ ఉదయాన బయలుదేరి నట్టున్నాడు[37] (తన యింట నాణ్యాలతో కూడిన రెండవకుప్ప దాచిపెట్టబడినట్టు ఎవరికీ తెలియదు!). తాను కొనిపోయిన నాణ్యాలను క్రింద దిమ్మరించేటప్పుడు, గుమికూడిన జనుల మధ్యనుండివచ్చే అంగీకారపు గుసగుసలను ఊహించి అతడు చిరునవ్వు నవ్వుకున్నాడు. వారు అతన్ని ''త్యాగ శీలుడు'' అనిగాని, ''దాతల ప్రభువు'' అనిగాని అతనికి పేరు పెట్టియుందురేమో!

తాను అపొస్తలుల యొద్దకు వచ్చినప్పుడు,[38] యితరులను నమ్మించాలని తలపెట్టిన తన యోచనయంతటి చొప్పున జరిగించాడు. అతడేమి చెప్పాడో, చేశాడో మనకు తెలియదు. అతని వైఖరి ఈ క్రిందచెప్పబడిన దాని పోలి ఉండవచ్చు.

''సప్పీరా, నేను కాలక్రమంలో భౌతికంగా దేవునిచే ఆశీర్వదింపబడ్డాం. ఆ దీవెనలను అంతటి భాగ్యంలేని సహోదర, సహోదరీలతో పంచుకొనడం మాకు సంతోషంగా ఉంది. కొన్ని సంవత్సరాలుగా ఒక భూభాగం మా కుటుంబానికి ఉంది, అయితే (ఆ మాటలను ప్రభావితంగా చేయడానికి ఆగి) మేము నిన్న దాన్ని అమ్మివేశాం'' అభివృద్ధి చెందినట్టున్నూ దైవభక్తి కలిగినట్టున్నూ కన్పించేలా ముఖాన్నిపెట్టి, ఆ డబ్బును పేతురు కాళ్లవద్ద పెడుతూ, ఆ డబ్బంతా యిదేనన్నాడు. అప్పుడు అతడు డబ్బు మొత్తం ఎంతో చెప్పి, వెనుకకువచ్చి నిలిచి, ''అది ఏముందిలే; అది నిజంగా అంతో మొత్తంకాదు'' అని చెప్పడానికి సిద్ధంగా ఉన్నాడు. దానికి బదులు వేషధారణ బయటపడింది; తన జీవితానికే ముప్పుకలిగింది! (ఈ వివరణ అంతా గ్రంథంలో లేనిదే - కేవలం ఈ రచయిత దీనిని ఊహిస్తున్నాడని బైబిలు పాఠకులకు తెలుసు).

> అప్పుడు పేతురు ''అననీయ నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? అది నీయొద్ద నున్నప్పుడు నీదేగదా? అమ్మిన పిమ్మట అది నీ వశమైయుండలేదా? యెందుకు ఈ సంగతి నీ హృదయములో ఉద్దేశించుకొన్నావు? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధ మాడితివని వానితో చెప్పెను'' (3-4 వచ.).

దేవుడు అందరి హృదయముల నెరిగినవాడైయున్నట్టు 1:24 వర్ణిస్తుంది. (హెబ్రీ. 4:13తో పోల్చిచూడు). ప్రభువుయొక్క సువార్త పరిచర్య కాలంలో, మనుష్యులు ఏమి ఆలోచిస్తున్నారో, అది ఆయనకు ఎరుకైయున్నట్టు గుర్తింపబడింది (మార్కు 2:8). నేడు, దేవుని యొక్కయు క్రీస్తుయొక్కయు ఆత్మద్వారా, అననీయ ఆత్మలో ఉన్న దుష్టత్వాన్ని పేతురు ప్రత్యక్షపరచి[39] సంఘంలో దాగి, దాన్ని ముంచివేసే బండలనుకూడా బయలుపరచాడు.

పేతురు మాటల్లో అనేక వాస్తవాలు మనకు తట్టుతాయి. మొదటిది, సాతాను[40] తన హృదయాన్ని ''నింపేలా'' అననీయ సమ్మతించినట్టు పేతురు తెలిపాడు. దేవుడుగాని, పరిశుద్ధాత్మగాని ఒకని హృదయాన్ని నింపెననడానికి, ''అతని హృదయమును నింపెను'' అనే పదప్రయోగాన్ని ముందుగా చూచాం. ఆ సందర్భంలో - దేవునియొక్కయు లేక, పరిశుద్ధాత్మయొక్కయు ''స్వాధీనంలో ఉండడం'' అనే భావాన్ని గుర్తించాం. దేవుడు ఎలా మానవ హృదయాన్ని నింపగలరో, అలాగే అపవాది కూడా మానవ హృదయాన్ని నింపగలడన్నమాట! ఆ పదప్రయోగానికి ''స్వాధీనంలో ఉండడం'' అనే భావమే ఉంది. తన తలంపులను, క్రియలను అపవాది స్వాధీనంలో ఉండేలా అననీయ సమ్మతించాడు. నీవు ''ఈ సంగతిని నీ హృదయంలో ఉద్దేశించు కున్నావని'' పేతురు అననీయతో అన్నాడు. సాతాను అననీయను శోధించి యుండవచ్చుగాని, అయితే కడకు తన చర్యలకు తానే బాధ్యుడు![41] ''ప్రతివాని నోటిలో బర్నబా పేరు నానుతున్నట్టు, నీ పేరుకూడా

ఉంటే అద్భుతంగా ఉంటుంది కదూ? అలా పొందడం ఎలాగో నేను నీకు చెప్పుతాను'' అని అననీయ చెవిలో సాతాను గుసగుసలాడినట్టు రచయిత ఊహించాడు. ''సారీ, అది నాకు యిష్టంలేదని'' అననీయ గట్టిగా అనగలిగియుంటే, అపవాది పారిపోయేవాడే (యాకోబు 4:7). దానికి బదులు, ''ఇంకా అధికంగా చెప్పు'' అంటూ అననీయ తన హృదయద్వారాన్ని విశాలంగా తెరిచాడు. అప్పుడు సాతాను ఊడ్చి, తన హృదయాన్ని నింపాడు. సాతానుకు నీ హృదయంలో ఎడమియ్యకుండడానికి జాగ్రత్తపడు![42]

పేతురు మాటల్లో మనకు తట్టే రెండవ విషయం ఏమంటే: భూమి అమ్మిన తరువాత అననీయ ఎదుటనే యిష్టా యిష్టాలు నిలిచాయి అన్ని వేళలా ఆస్తి తన స్వాధీనంలోనే ఉంది. పాపంచేయకుండ, ఆ ఆస్తితోగాని, దాని వెలతోగాని తనకు యిష్టంవచ్చినట్టు చేసికోవచ్చు. మొదట దాన్ని అతడు అమ్మనవసరంలేదు; అమ్మిన తరువాత కూడా ఆ డబ్బంతా అతడు యివ్వనవసరంలేదు. అననీయ సప్పీరాల పాపం, ఆ వెలలో కొంత దాచుకొనడంకాదు. అయితే దానిలో కొంత దాచుకొని, కొంత యిచ్చి, తాము అంతా యిచ్చినట్టు నటించడమేనని నేను మరొక మారు ఒత్తి పలుకుతున్నాను.

అననీయు అబద్ధమాడినట్టు పేతురు నేరస్థాపన చేశాడు. అపవాది ''అబద్ధికుడు, అబద్ధమునకు జనకుడు'' కూడా (యోహాను 8:44). ఒకని హృదయం సాతానుచే నింపబడినప్పుడు, అబద్ధాలు రావడం సహజమే. అంతకంటే ప్రాముఖ్యమైన సంగతేమంటే, అననీయ దేవునితో అబద్ధమాడాడు. అననీయ ''పరిశుద్ధాత్మతో'' అబద్ధమాడినట్టు పేతురు 3వ వచనంలో సూచించాడు. నాల్గవ వచనంలోనైతే - ''నీవు మనుష్యులతోకాదు దేవునితోనే అబద్ధమాడితివని'' అతడు నొక్కి చెప్పాడు. మాటలు మింగివేయ[43] బడినట్టు ఉద్దేశింపబడిందో, లేదోగాని - అంటే, ''నీవు మనుష్యులతోనే కాదు దేవునితోకూడ అబద్ధమాడితివి'' (అని అన్నాడోలేదోగాని) - అననీయ దేవునితో[44] అబద్ధమాడినట్టు మాత్రం నొక్కి చెప్పబడింది. అబద్ధం అనే మాట అననీయ మనస్సులోనికి ఒకవేళ ప్రవేశించి యున్నట్టయితే, తాను అపొస్తలులతోను ... సంఘంతోను అబద్ధ మాడతున్నట్టు భావించియుండి యుంటాడు. అయినా, అపొస్తలులు - దేవుని ఆత్మచేత నింపబడి యున్నారు. సంఘం దేవుని ఆలయం. అననీయ వారితో అబద్ధమాడినప్పుడు, అతడు దేవునితోనే అబద్ధమాడాడు!

ముఖ్యంగా పాపమనేది దేవునికి విరోధమయ్యింది. అది యితరులను బాధించవచ్చు. బాధించకపోవచ్చు. కాని పాపం సర్వశక్తునికి విరుద్ధమైన తిరుగు బాటే![45] ఇది నీమనస్సులో ఉంచుకో. అననీయ, సప్పీరాల పాపాన్ని మనం పరిశీలించే టప్పుడు, యిది నీకు సహాయపడుతుంది.

పేతురు అననీయతో చెప్పిన మాటలనుగూర్చి యింకో విషయం చెప్పాలి: పేతురు అననీయను శపించలేదు. పేతురు అననీయ పాపాన్నిగూర్చి నేరుగా మాట్లాడాడుగాని, పేతురు పలుకుల్లో మరణ తీర్పు కన్పించదు. తరువాత ఏమి జరిగిందో చూచినప్పుడు తక్కినవారు ఎంతగా ఆశ్చర్యపడ్డారో పేతురుకూడా అంతగానే ఆశ్చర్యపడియుండవచ్చు.

> అననీయ యీ మాటలు వినుచునే పడి ప్రాణము విడువగా వినువారి కందరికిని మిగుల భయము కలిగెను; అప్పుడు పడుచువారు లేచి వానిని బట్టతో చుట్టి మోసికొనిపోయి పాతిపెట్టిరి (5-6 వచ.).

ఈ వచనాలకు రాగానే అనేకమంది వ్యాఖ్యానకర్తలు, తమ పండ్లు కొరుకుతూ, తమ బట్టలను చింపుకొంటూ, తమ జుట్టును పెరికివేసికొంటారు.[46] ''అది అలా జరుగలేదు! సభ్యులను క్రమపరచడానికి అది తరువాత కనిపెట్టబడిన కథయేనని'' కొందరు నినాదాలు చేశారు. ''ఏదో కొద్దిగా జరిగి ఉండవచ్చు, గాని భయానకమైన రూపం యివ్వడానికి, దాన్ని యిలా పెంచారని'' కొందరు ప్రకటించారు. ''పేతురు కఠినంగా మాట్లాడిన తీరునుబట్టి అననీయకు గుండెపోటువచ్చి, అతడు చచ్చిపడి యుండవచ్చు''నని కొందరు గుర్తించారు. ''తాను క్రీస్తుయొక్క స్వభావాన్ని పూర్ణంగా గ్రహించుకోలేదని'' దాదాపు అందరు పేతురును విమర్శించారు. ''కాపరిగా అతడు క్రొత్తవాడని మనం గుర్తుంచుకోవాలి. మంద యెడల తనవైఖరిని శాంతంగా మార్చుకొనేలా, ఈ దుర్ఘటన అతనికి (పాఠం) నేర్పిందని'' ఇంకొకడు పేతురు పక్షంగా మాట్లాడుతాడు .

అననీయకు ఏమి జరిగిందో కొన్ని ఆలోచనలను మనం గ్రహించాలి:

(1) లూకా చెప్పినట్టే అతనికి సంభవించింది! అది అలా జరుగనట్టయితే, లూకా నమ్మదగిన సాక్షికాదు గనుక అతడు తన రచనలో చెప్పింది దేన్నీ మనం నమ్మకూడదు!

(2) సాతాను జరిగించిన దాని విషయంలో - పేతురు దేవుని పరిశుద్ధాత్మచే నడిపింపబడ్డాడు! (పేతురు కొన్నిసార్లు పొరపాటు చేసినమాట వాస్తవమే [గలతీ. 2:11-13], అయితే నేరుగా పరిశుద్ధాత్మయొక్క స్వాధీనంలో ఉన్నప్పుడు మాత్రం కాదు). 5:1-11ల్లో ప్రధానపాత్ర అననీయ, సప్పీరాలదో, పేతురుదో కాదు -పరిశుద్ధాత్మదే!

(3) దేవుని ప్రతినిధిగా పేతురు మాట్లాడాడు. అననీయ ఏమిచేశాడో, తనలో నివసించిన దేవుని ఆత్మ పేతురుకు బయలుపరచాడు. అననీయ పాపం అపొస్తలులకు విరోధమయ్యింది కాదు, అది దేవునికే విరోధమయ్యిందని పేతురు విశదపరచాడు.

(4) అక్కడ జరిగింది - దేవుని యొద్దనుండి వచ్చిన తీర్పే.[47] ''చివరి ఊపిరిని పీల్చెను'' అనే ప్రయోగం - ''ఆత్మ'' ''బయటికి వెళ్లెను'' అని అర్థం యిచ్చే మిశ్రిత

గ్రీకుపదంనుండి వచ్చింది.[48] ఇలాటి అసాధారణమైన ప్రయోగం క్రొత్త నిబంధనలో 12:23లో[549] మాత్రమే చేయబడింది. అది హేరోదు మీదికి వచ్చిన తీర్పునుగూర్చిన సందర్భం: ''అతడు దేవుని మహిమ పరచనందున వెంటనే ప్రభువుదూత అతని మొత్తెను గనుక పురుగులుపడి ప్రాణము విడిచెను''. ''చచ్చెను'' అనే పదం 5:5లో ఉన్నట్టు - ''కడ ఊపిరి పీల్చెను'' అనే భావమిచ్చే గ్రీకుమూలమునుండి వచ్చింది.

అననీయ చనిపోయిన తరువాత, ''వినినవారికందరికి మిగుల భయము కలిగెను'' అని వ్రాయబడింది. ప్రతివానికి గుండెపోటు వస్తుందని భయపడి యుండారంటావా? లేదు. అననీయ యొక్క మరణం - వారికందరికి దేవుని యెడల భయము కలిగించింది![50] (అక్కడ సంభవించింది దైవ స్వభావానికి సంబంధించింది కాదని భావించేవారు, లేవీ. 10లో నాదాబు అబీహులకు ఏమి జరిగిందో; 2 సమూ. 6లో ఉజ్జాకు ఏమి తటస్థించిందో మరచియుంటారు. ఆయన ఆ తరువాత హేరోదుకు ఏమి జరిగించారో యికను చెప్పనవసరమేలేదు - అపొ. 12).

అక్కడ నాకు తెలియనిది చాల ఉంది. మారుమనస్సు పొందే అవకాశం అననీయకు యివ్వబడిందో లేదో నాకు తెలియదు.[51] అననీయను, అతని భార్యయైన సప్పీరాను దేవుడు ఎలా చంపివేశారో నాకు తెలియదు[52] అయితే, వారికి జరిగిన సంభవం ఆనాటి క్రైస్తవులకు ఎలాగో, నేటి క్రైస్తవులకును అలాగే; (నీకు, నాకు చేర్చి) పాఠమైయుండేలా ఉద్దేశింపబడింది - అది మాత్రం నాకు తెలుసు.

దేవుడు నరులతో తనవైఖరిని కొనసాగించేటప్పుడు, పాపంయొక్క భయంకర త్వాన్ని ఆయన నొక్కి చెప్పారు. అందులో తరచుగా, ప్రజలు తనతో క్రొత్త బాంధ వ్యంలో ప్రవేశింపబోయే సమయంలో యిలా జరుగుతూ ఉంటుంది. ఆ విధంగా, యాజకత్వం క్రొత్తగా ప్రవేశపెట్టబడిన సందర్భంలో ఆయన నాదాబు అబీహులను కూలద్రోశారు (లేవీయ. 10), దావీదుద్వారా ఇశ్రాయేలీయులు తమ నిబంధనను ఉజ్జీవింపజేసికొనే సందర్భంలో, ఉజ్జా చంపివేయబడ్డాడు (2 సమూ. 6).

అపొ. 5లో సంభవించినదానికి సమాంతరమైనదిగా, ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమిలో ప్రవేశింపబోయే సమయంలో జరిగిన ఆకాను కథయందు కన్పిస్తుంది. ''దాచుకొన్న'' అని 5:2లో ఉన్న పదప్రయోగం లాటిది యెహోషువ 7:1 యొక్క గ్రీకు తర్జుమాలో ఉపయోగింపబడింది. ఇశ్రాయేలీయులు పట్టుకోవలసిన తొలి పట్టణం - యెరికో. ప్రశస్తమైన లోహాలన్నీ ప్రభువుయొక్క ధనాగారానికి చేర్చవలసిందిగా యెహోషువ సైనికులకు ఆజ్ఞాపించాడు. వారు పట్టణాన్ని పట్టి నప్పుడు, అందమైన, విలువైన అనేక వస్తువులు ఆకాను కంటపడ్డాయి. తాను కనుగొన్న వాటినుండి మరలక ముందే, దురాశ అతన్ని అలుముకొంది. గనుక సమస్తాన్ని యిచ్చివేసే దానికి బదులు, అంతా యిచ్చినట్టు నటించి, కొంతమాత్రం తన డేరాలో దాచుకొన్నాడు; నాశనం వెంబడించింది. ఆకానుయొక్క మోసం ఇశ్రాయేలీయులకైన

దేవుని ఏర్పాటుకు ముప్పు కలిగించింది. ఆ కథ ఆకానును అతనికి కలిగిన యావత్తును నాశనం చేయడంతో అంతమయ్యింది.[53] దేవుని ప్రజలు వాగ్దాన భూమియొక్క పొలిమేరలకు చేరుకున్నారు. పాపం విషయంలో ఆయన కఠినంగా ఉండే విషయాన్ని వారు గ్రహించాలని దేవుడు కోరాడు! ఆ తరువాత రమారమి పద్నాలుగు వందల సంవత్సరాలకు, క్రైస్తవ్యంయొక్క ప్రారంభదినాల్లో కూడా వారు అదే సత్యాన్ని నేర్చుకోవాలని దేవుడు కోరారు.

అపొ. 5లోని దుర్ఘటన ఈ మాటలతో ముగించబడుతుంది: ''అప్పుడు పడుచువారు[54] లేచి వానిని బట్టలతో చుట్టి[55] మోసికొనిపోయి పాతిపెట్టిరి'' (6 వ.). మరణానంతరం జరిగే సహజ కార్యకలాపాలు లేకపోవడం,[56] అప్పటికప్పుడే భూస్థాపన జరిగించడం అనేవి - నాదాబు అబీహులు బలిపీఠం నొద్ద అగ్నిచేత దహింపబడిన సంగతిని జ్ఞప్తిచేస్తుంది. ''మోషే చెప్పినట్లు వారు సమీపించి చొక్కాయిలను తీయకయే పాళెము వెలుపలికి వారిని మోసికొని పోయిరి'' (లేవీయ 10:5).[57] అననీయ మృతదేహపు భూస్థాపనకు తొందరపడిన కారణం - యెరూషలేం పట్టణంలోని మృతదేహాన్ని ఆ రోజే పాతి పెట్టాలనేదే నని కొందరన్నారు. అయితే భూస్థాపన త్వరగా చేయవలసిన అవసరమున్నా, అప్పటికప్పుడే అది చేయనవసరంలేదు. అలాటి భూస్థాపన ఒక పాఠం నేర్పించడానికి సాధనమున్నట్టు కన్పిస్తుంది. కార్యకలాపంలేకుండ సమాధిచేయడం - ఒక జంతువును పాతిపెట్టినట్టు పాతిపెట్టడమే ఔతుంది (యిర్మీయా 22:19).

ఆ దుర్ఘటన అంతటితోనే అంతం కాలేదు. రెండవ ఘట్టం యింకా రావలసి యుంది ఈ కుట్రలో సప్పీరాకుకూడా పాలుంది. ''ఇంచుమించు మూడు గంటల సేపటికి వాని భార్య జరిగినది యెరుగక లోపలికి వచ్చెను'' (7 వ.). అననీయతో సప్పీరా ఎందుకురాలేదు? కుటుంబ యజమానిగా ఆ డబ్బు తీసికొనిపోయి జమచేసి, తిరిగి సప్పీరా చెంతకు వచ్చి, జరిగిన ఉత్సాహకరమైన వివరాలు వినిపించాలని తలంచాడేమో. అతడు వెంటనే తిరిగి రాకపోయేసరికి - వారి కానుక విషయమై జరుగుతున్న ఉత్సవం పొడిగించబడినట్టు తాను భావించియుండవచ్చు. సమయం చాలా గడిచేటప్పటికి, ఆమె చికాకు పడియుండవచ్చు - తాను ఆలస్యంచేసిన కారణమేమో కనుగొనడానికి ఆమె వచ్చింది.[58]

తన భర్త చనిపోయిన విషయం తనకు తెలియకుండ మూడు గంటలు ఎలా గడిచాయి? జరిగిన సంగతి ఎవరితోనూ[59] చెప్పవద్దని పేతురు ఆజ్ఞాపించియుంటాడు. జరిగిన దాని విషయంతో ఒప్పింపబడిన జనులు - తాను చెప్పినట్టే చేసియుంటారు.[60] సప్పీరానుండి సమాచారాన్ని సరిగా వినేలా జరిగిన సంగతి తనకు తెలియక ఉండాలని పేతురు నిషేధించియుండవచ్చు. తన తప్పును దిద్దుకొనడానికి[61] యిది ఆమెకు అవకాశమైయుండవచ్చు. ఎలాగైనాసరే, తన భర్త

ఏమయ్యాడో అనే విషయాన్నిగూర్చి సప్పీరా ఆలోచించినా తాను గదిలోనికి ప్రవేశించినప్పుడు, తనకేమి సంభవించనై యుందో తనకు తెలియదు.

ఆ కూడిక స్థలానికి వచ్చినప్పుడు ఆమె ఏమంది? అది యిలాగైయుండవచ్చు: ''నా భర్తను మీలో ఎవరైనా చూచారా? అననీయ యింటనుండి బయలుదేరి మూడు గంటలయ్యింది. నాకు వేదనగా ఉంది!'' తానేమి అడిగియున్నా, పేతురు - ఆమె మాటలకుగాని చర్యలకుగాని బదులిచ్చినట్టులేదు. ''మీరు ఆ భూమిని[62] ఇంతకే అమ్మితిరా''?[63] అని పేతురు అడిగాడు[64] (8a వ.). అక్కడే పడియున్న డబ్బువైపు చేయిచాచి, అలా అని యుండియుండవచ్చు.

పేతురు ప్రశ్న సప్పీరాను ఎంతటి ఆశ్చర్యచకితురాలనుగా చేసిందో! ఆమె తన భర్తను కనుగొనడానికి వచ్చింది. అతడు కనబడకపోగా, తమ సొమ్ము విషయమైన ప్రశ్నను ఎదుర్కోవలసి వచ్చింది. ఆమె గుండె వేగంగా కొట్టుకొంటుదని నేను ఊహిస్తు న్నాను. ''ఏదో సరిగా లేదు'' అని ఆమె తలంచియుండవచ్చు. ఏమి జరిగిందో రహస్యాన్ని కనుగొనడానికి చుట్టూ పారజూచియుండవచ్చు. తన్నుచూస్తున్న వారి ముఖాల్లో ఏదీ తనకు కన్పించినట్టులేదు. తమ మోసం విషయంలో మారుమనస్సు పొంది, ఒప్పుకొనే దానికి సమయం యియ్యబడింది (8:22; 1 యోహాను 1:9). అయితే గర్వం తన పాపాన్ని ఒప్పుకొనేదానికి సమ్మతించనివ్వలేదు. ''అవును అంతకే''నని మొండిగా జవాబిచ్చింది (8b వ.).

''ప్రభువుయొక్క ఆత్మను శోధించుటకు[65] మీరెందుకు ఏకీభవించితిరి?''[66] అని అడిగేటప్పుడు పేతురు విచారంతో తన తలను ఆడించియుండవచ్చు (9a వ.). ''పరిశుద్ధాత్మను పరీక్షించాలనే'' ఉద్దేశం అననీయ సప్పీరాలకు లేదనుకుంటాను. వారి ఉద్దేశం - గుర్తింపు, అభిమానంలాటివి పొందాలనేదే అయితే వాస్తవానికి, వారి చర్య ప్రభువుయొక్క ఆత్మను పరీక్షించేదిగా పరిణమించింది! దేవుని ఆత్మను శోధించడమంటే - అరణ్యంలో ఇశ్రాయేలీయులు మాటిమాటికి విసిగించిన సంగతులను జ్ఞప్తికి తెచ్చుకొంటే అర్థమౌతుంది (నిర్గమ. 17:2; ద్వితీయో. 6:16). ఇంటివద్ద, ఒక బిడ్డ తల్లిదండ్రులను కావాలని విసిగిస్తూ, వారి ఓర్పును పరీక్షిస్తూ ఉంటాడు!

దేవుని శోధించడం అంటే - దేవుడు తన వాగ్దానాలను నిలబెట్టుకొంటాడో, లేదోయని పరీక్షించడం! యేసు శోధింపబడినప్పుడు - దేవాలయపు శిఖరంనుండి క్రిందికి దూకితే, దేవదూతలు వచ్చి, తమ చేతులతో ఆయన్ను ఎత్తిపట్టుకొంటారని అపవాది ఆయనతో అనగా, ''నీ దేవుడైన ప్రభువును శోధింపవలదు'' అని ద్వితీయో. 6:16ను ప్రభువు వానికి ఎత్తి చూపారు (మత్తయి 4:7). దేవుని వాగ్దానాలను పరీక్షించుట - నమ్మికలేని తనమైనట్టు[67] యేసు ఎరుగును.

అననీయ సప్పీరాల పాపం ఎంత ఘోరమయిందో - పేతురు మాటలు సూచిస్తున్నాయి. ఈ పాపం బయలుపరచబడి, శిక్షింపబడవలసిన అవసరం ఎందుకుందో

- ఒక వ్యాఖ్యానకర్త యిలా వివరించాడు:

> ఈ పాపచర్యకు కఠినమైన శిక్ష కలుగకుంటే, ఆ మోసం బయటపడిన తరువాత విశ్వాసులమీద దాని ఫలితాలు కఠినంగా ఉండేయే![68] యధార్థత లేకుండడం లాభ దాయకంగా కన్పించడం మాత్రమేగాక, ఆత్మను సహితం మోసగించగలమనే నిర్ణయానికి జనులు వచ్చియుండేవారే. దేవుడు ఈలాటి వేషధారణను, మోసాన్ని[69] సహించలేరని ప్రారంభంలోనే మార్గాన్ని తేటగా కనుపరచడం ప్రాముఖ్యమైయుంది.

బాల్య దశలోనున్న సంఘం పడి బద్ధలైపోవడానికి అనువుగా అననీయ, సప్పీరాల పాపం నిజంగా దాగియున్న బండయే. వారి మోసం జయించియున్నట్టయితే, ఆత్మచే నడిపింపబడిన అపొస్తలులయొక్క నమ్మకత్వం, వారి అధికారం ప్రశ్నార్థకంగా త్రోసి వేయబడియుండేదే. సంఘం ప్రభావితమైన నాయకత్వం లేక కుంటుబడి యుండేదే!

వారి నటన లేక బూటకం ఫలించకుండేలా, దేవుడే చర్య తీసికొన్నారు. తన పాపాన్ని ఒప్పుకొనే అవకాశాన్ని సప్పీరా కాళ్లదన్నుకుంది, ''అప్పుడు పేతురు విచారంతో - ''ఇదిగో నీ పెనిమిటిని పాతిపెట్టినవారి పాదములు వాకిటనే[70] ఉన్నవి. వారు నిన్నును మోసికొనిపోవుదురని ఆమెతో చెప్పెను'' (9b వ.). దిగ్భ్రమ వెంట దిగ్భ్రమ కలిగింది. ఆమె భర్త చనిపోయి పాతిపెట్టబడటం మాత్రమే గాక, తానుకూడా అదే పరిస్థితిని ఎదుర్కొంది![71]

ఈసారి ఏమి ఎదురు చూడాలో పేతురుకు తెలిసినట్టులేదు (ఇంతకు ముందు[72] జరిగిన దాన్నిగూర్చి ఆలోచించడానికి అతనికి మూడు గంటల సమయముంది). అయితే, సప్పీరా మరణం - పేతురువలన జరిగినది కాక, దేవునివలననే జరిగినదని తిరిగి నేను నొక్కి చెప్పుతున్నాను.

> వెంటనే ఆమె అతని పాదములయొద్ద పడి ప్రాణము విడిచెను.[73] ఆ పడుచువారు, లోపలికివచ్చి, ఆమె చనిపోయినది చూచి, ఆమెను మోసికొనిపోయి, ఆమె పెనిమిటియొద్ద పాతిపెట్టిరి. సంఘమంతటికిని, ఈ సంగతులు వినినవారికందరికి మిగుల భయము కలిగెను (10-11 వచ.).

''వినినవారికందరికిని మిగుల భయము కలిగెను'' అన్న విషయాన్ని లూకా నొక్కి చెప్పాడు. Weymouth's versionలో ''భీతిచెందారు''[74] అని ఉంది; Beck's versionలో ''భయపెట్ట బడ్డారు''[75] అని వుంది. తన పాఠకులు దాన్ని పోగొట్టుకొనక ఉండేలా - అప్పుడు కలిగిన భయాన్నిగూర్చి లూకా రెండు సార్లు ప్రస్తావించాడు (5, 11 వచ.). దేవుడు పాపం విషయంలో కఠినంగా ఉంటారు - ఆ సంగతిని నరులు గుర్తించాలి! ''మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు'' - అని పౌలు అన్నాడు (గలతీ. 6:7). అలా చేయ ప్రయత్నించినప్పుడెల్లా, నరులు శిక్షింపబడ్డారు!

అందరికి భయం కలిగిన విషయాన్ని లూకా తెలిపేటప్పుడు,[76] అంతకమునుపు

పుస్తకంలో ఉపయోగింపబడని ఒక పదాన్ని లూకా మెల్లగా జారవిడిచాడు: అది ''సంఘం'' అనే పదం.[77] ''సంఘం'' అనేది *Ekklesia* అనే పదంనుండి తర్జుమా చేయబడింది. *Ekklesia* అనే పదం గ్రీకులో (కూడికగా ఉండటానికి పిలువబడిన ఏ గుంపుకైనా ఉపయోగించబడింది;[78] 19:32, 39, 41 చూడు). క్రైస్తవ్యంలో ఈ పదం ప్రత్యేకమైన భావాన్ని సూచించడానికి వినియోగించబడింది. దేవుని ప్రత్యేకమైన ప్రజలు - లోకంలోనుండి క్రీస్తు యేసుతో క్రొత్త బాంధవ్యం కలిగియుండడానికి పిలువబడినవారు అనే భావంతో యిది వాడబడింది.[79] కార్యగ్రంథంలో - బయటికి పిలువబడిన దేవుని ప్రజలనందరిని సూచించడానికి ఉపయోగింపబడింది (20:28), కొన్నిసార్లు స్థానికంగా ఉన్న దేవుని ప్రజలను సూచించడానికి అది ప్రయోగింపబడింది (8:1; 11:22; 13:1లను చూడు).[80]

''సంఘం'' అనే పదాన్ని లూకా యిక్కడ పెట్టడంలో-ఈ పాఠం కేవలం సంఘానికి వెలుపలనున్నవారికి మాత్రమేగాక, ప్రత్యేకించి సంఘంలో ఉన్న మనకు పాఠంలా ఉండ నుద్దేశింపబడింది. సంఘంలో సభ్యులైన మనమెవరమైనా, అననీయ, సప్పీరాల సమాధులను చూస్తే బెదరిపోకుండా ఉండగలమా? ''పెద్ద'' పాపాలకు దేవుడు వారిని చంపివేయలేదు. మనకు తెలిసినంత మట్టుకు- నరహత్య, దొంగతనం, జారత్వం, త్రాగుడు అనే వాటి విషయంలో వారు దోషులైనట్టులేదు. సంఘంలో[81] వారు ఒక అబద్ధాన్ని చెప్పినట్టున్నారు - వారున్నదానికంటె శ్రేష్ఠులైనట్టు ప్రజల అభిమానంకొరకు వారిలా చేశారు. మనం ఎప్పుడైనా అలా చేస్తామా? ప్రార్థించాలనే సంకల్పంలేకుండా, ''నేను నీకొరకు ప్రార్థిస్తాను'' అని చెప్పి - మనం నిజంగా ఉన్నదానికంటె ఎక్కువగా ఆత్మసంబంధులైనట్టు గుర్తింపు పొందగోరామా? అననీయ సప్పీరాలయొక్క నిర్దిష్టమైన పాపం- యిచ్చే విషయంలో అబద్ధమాడటం. మనం వర్థిల్లిన కొలది మనలో ప్రతి ఒక్కరు సంతోషంతో యివ్వడమనేది-సంఘ సంబంధమైన ఆర్థిక వ్యవస్థగా దేవుడు ఏర్పరచారు (1 కొరింథీ. 16:2; 2 కొరింథీ. 9:6-13). మన కానుక సమర్పింపబడిన తరువాత, మనం యివ్వవలసినంత మనం యిస్తున్నాం; మనం వర్థిల్లిన దానికి యిది సమానంగా ఉందని మనం ఉద్దేశిస్తున్నామా? ఒకవేళ అది అలా కాకపోయినట్లయితే ఏమౌతుంది? మన కానుకల విషయంలో అబద్ధమాడి దోషులమయ్యామా?[82]

అపొ. 5లో అనుసరించిన రీతినే దేవుడు సంఘంలోని పాపం విషయంలో నేడు అనుసరించితే ఎలా ఉంటుంది? అనే ప్రశ్న వద్దకు అది మనలను తెస్తుంది. అలాగే నేడు సంభవిస్తున్నట్టయితే, శవాన్ని గుర్తించి పాతి పెట్టకముందు, మృతులను పెట్టే స్థలం ఒకటి చర్చిబిల్డింగు క్రింద ఉండాలి; సంఘపు పనివారిలో చావులు లెక్కవేసే వానిని ఒకని నిలుపాలి; పాతిపెట్టు పరిచర్యకొరకు ఎక్కువమంది పరిచారకులను నియ మించవలసి యుంటుంది![83]

అననీయ సప్పీరాల పాపానికి జరిగించినట్లు, దేవుడు నేడు జరిగించకపోవచ్చు.[84] కాని, దేవుడు పాపం విషయమై కాఠిన్యాన్ని తగ్గించుకొన్నాడనే ఆలోచనలో నిద్రించ నవసరంలేదు సుమా!

> పగతీర్చుకొనుట నా పని, నేనే ప్రతిఫలమిత్తుననియు, మరియు ప్రభువు తన ప్రజలకు తీర్పు తీర్చుననియు చెప్పిన వానిని ఎరుగుదుము గదా. జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము (హెబ్రీ. 10:30-31)

> … ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవచేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు (హెబ్రీ. 12:28-29).

## పూర్తివేగం ముందుంది (5:21-14)

అననీయ సప్పీరాల కథను విడువకముందు, సంఘ క్రమ శిక్షణను గూర్చి ఒక మాట చెప్పవలసిన అవసరముంది. ఈ మధ్య కాలంలో బాగా ప్రచురింపబడిన[85] కోర్టు కేసులనుబట్టి కొందరు సంఘనాయకులు ప్రభువు ఆజ్ఞాపించిన క్రమశిక్షణను అమలుచేయడానికి వెనుకంజ వేస్తున్నారు. అననీయ సప్పీరాల సంఘటన సంఘ క్రమశిక్షణయొక్క అవసరతను తేటగా చూపుతుంది.

అపొ. 5 సంఘ క్రమశిక్షణకు నమూనా కాదని నేను గ్రహించాను. అపొ. 5లో దేవుడు జరిగించారు; సంఘ క్రమశిక్షణలో, స్థానిక సంఘం పనిచేస్తుంది (మత్తయి 18:15-17; 1 కొరింథీ. 5:4-5). అపొ. 5లో అననీయ సప్పీరాలు ఈ జీవితం నుండి తొలిగింపబడ్డారు; సంఘ క్రమశిక్షణలో, క్రమశిక్షణ పొందే వ్యక్తి, మన సహవాసంనుండి తొలిగింపబడతాడు[86] అయినా, అపొ. 5కు సంఘ క్రమశిక్షణకు మధ్య అనేక సమాంతరాలు కన్పిస్తాయి. సంఘంలోని పాపం క్రీస్తుప్రభువు యొక్క పనిని బాధిస్తుంది. పాపం విషయంలో వెంటనే చర్య తీసికొనక పోయినట్లయితే, అది వ్యాపిస్తుంది. మారుమనస్సుపొందని వారిని క్రమశిక్షణ క్రిందికి తేవాలి-ఇది కేవలం వారికొరకు మాత్రమేకాదు - సంఘమంతటి క్షేమంకొరకు ఈ పని జరగాలి.

ఈ చివరి విషయాన్ని నొక్కి చెప్పుతాను: క్రమ శిక్షణయొక్క ప్రాథమిక ఉద్దేశం తప్పిపోయిన వానిని పునరుద్ధరించడం (1 కొరింథీ. 5:5). ఒకవేళ అలా జరుగకుంటే దాని సంగతి ఏమి? అననీయ సప్పీరాల సంఘటనలో అది అలా జరుగలేదు. అయినా సంఘ క్రమశిక్షణలో విలువ ఉందా? అది సంఘంలో నుండి పాపాన్ని వ్రేళ్లతో పెరికివేస్తుంది. దాన్నిబట్టి మనం ఎక్కడ నిలిచామో అది లోకానికి తెలియజేస్తుంది (1 కొరింథీ. 5:1, 6-7)!

సంఘ క్రమశిక్షణ వెనువెంట సంఘ అభివృద్ధి జరగ డం కేవలం సంభవాల కలయికయే కాదు. ఆకాను పాపానికి శిక్షవచ్చినప్పుడు ఇశ్రాయేలీయులకు తమ శత్రువులపై ఘన విజయం ఎలా లభించిందో, అననీయ సప్పీరాల శిక్ష తరువాత

సువార్తకు అలాగే ఘన విజయం లభించింది!

> ప్రజలమధ్య[87] అనేకమైన సూచకక్రియలను మహత్కార్యములును అపొస్తలులచేత చేయబడుచుండెను. మరియు వారందరు ఏకమనస్కులై సొలొమోను మంటపములో[88] ఉండిరి. కడమవారిలో ఎవడును వారితో[89] కలిసికొనుటకు తెగింపలేదుగాని ప్రజలు వారిని ఘనపరచుచుండిరి. పురుషులును స్త్రీలును[90] అనేకులు మరియొక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి (12-14 వచ.).

క్రమశిక్షణయొక్క ఫలితాలను గమనించి చూడు: (1) అపొస్తులుల యొక్క నమ్మకత్వం చెక్కుచెదరకుండా ఉంది. వారు సూచక క్రియలను మహోత్కార్యాలను యింకా జరిగిస్తునే ఉన్నారు. (2) సంఘంలో ఐక్యత నిలకడగా ఉంది. వారందరు ఏకమనస్కులై యున్నారు. (3)[91] ఏదైనా పొందాలనే ఉద్దేశంతో సంఘంలో కలవాలని తలంచినవారు[92] భయపడిపోయారు.[93] వారితో కలవడానికి తెగించలేదు. (4) క్రైస్తవులు కానివారు సహితం సంఘాన్ని గౌరవించారు ''ప్రజలు వారిని ఘనపరచు చుండిరి.'' (5) క్రమశిక్షణ సంఘ సభ్యులను భాధించలేదు. అననీయ సప్పీరాల దుర్ఘటన నిజవిశ్వాసులను భాధించలేదు. ''పురుషులును స్త్రీలును అనేకులు యెక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి.''

అపవాదియొక్క తంత్రం విఫలమవ్వడం సంఘానికి మేలైంది. వాని తంత్రం ఫలించియున్నట్టయితే, సంఘానికి అది చేటుగా పరిణమించేదే! అపవాది సంఘాన్ని విడదీసి, అవమానపరచి, క్షీణింపజేయ బూనాడు. కాని సంఘం ఏకంగా నిలిచి, అభినందింపబడుతూ అభివృద్ధిచెందుతుంది! అయినా, అపవాది తన కార్యాన్ని ముగించుకోనట్టు తరువాత పాఠంలో చూస్తాం.

## ముగింపు

4:32నుండి 5:14వరకు మనకు చాలా పాఠాలు యివ్వబడ్డాయి. మనం స్వార్థరహితంగా ఉండాలని దేవుడు కోరుతున్నారు. మన జీవితాల ద్వారా సువార్తకు సహకారులమైయుండాలని దేవుడు వాంఛిస్తున్నారు. సంఘ నాయకులను మనం గౌరవించాలని దేవుడు కోరుతున్నారు. ఆయనను గౌరవించాలని దేవుడు కోరు తున్నారు. ఆయన సమస్తాన్ని చూస్తూ, సమస్తాన్ని ఎరిగిన వారు గనుక మనం దేవుని మోసగించలేమని ఆయన మనలను తెలిసికోమంటున్నారు. మనం క్రైస్తవులమైయున్న ప్పటికిని, పాపం మనలను పడవేయగలదు[94] మనం మన జాగ్రత్తలో ఉండాలనే పాఠాన్ని మనం చూడగలం (1 కొరింథీ. 10:12).

ఇక్కడ మనకు కొట్టినట్టు కన్పించే పాఠం ఏమంటే - ఒక పరిస్థితిలో మనం ఏమిచేస్తున్నాం అనేది ఎంత ప్రాముఖ్యమో, ఎందుకు చేస్తున్నామనేది కూడా అంతే ప్రాముఖ్యమైయుంటుంది. అననీయ సప్పీరాలు చేయనుద్దేశించింది ప్రాథమికంగా

మంచిదే. వారు సంఘానికి కొంత మొత్తం యివ్వాలని నిర్ణయించుకొన్నారు. వారు ఎందుకు యిస్తున్నారనేది, వారి కానుకను వ్యర్థపరచింది. వారు మనుష్యుల పొగడ్తను పొందలేదు - కనుక వారు యిచ్చిన దానికంటె వారి కానుక ఎక్కువైనదన్నట్టు చూపడానికి వారు అబద్ధమాడారు.

ప్రభువును సేవించడంలో నా ఉద్దేశమేమి? నీ ఆశయాలేమి? ఆయనకు నన్ను నేను సమర్పించుకొనడం యుక్తం గనుక అలా సమర్పించుకొనే సేవ చేస్తున్నానా? ఆయన్ను సేవించడంవలన ''మనుష్యులకు కనబడాలనే'' గుర్తింపు కావాలనే ఉద్దేశంతో సేవచేస్తున్నానా?

యథార్థంగా పరీక్షించుకొన్నప్పుడు, నీ హృదయానికి శస్త్ర చికిత్స కావలసివస్తే, ఇప్పుడే దానికి అనుకూలమైన సమయం. అననీయ సప్పీరాలవలె దేవుడు మనలను మొత్తకపోయినా, ఆ వేషధారులకు వచ్చినట్టు మరణం మనకు తటాలున తటస్థించవచ్చు. సృష్టికర్తను సంధించడానికి అది ఆలస్యంగా మారిపోతుంది. ఇది నీ హృదయంలో చెక్కబడనివ్వు: ఒకడు సిద్ధపడనట్లయితే - ''జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము'' (హెబ్రీ. 10:31).

## ప్రసంగ సూచనలు

Rick Atchley అపొ. 4:32-37 మీద "Give and Take'' అనే ప్రసంగాన్ని చేశాడు. ప్రసంగంలో సగం భాగం - క్రైస్తవులు కృపగలిగి యిచ్చేవారు మాత్రమేగాక, కృపతో పొందేవారుకూడా ఉండ నేర్చుకోవాలనే సందేశం ఉంది. యెరూషలేములోని సభ్యులు హృదయాలు తెరచి, వారి జీవిత అవసరతలను గుర్తించారు. క్రీస్తునందున్న సహోదర సహోదరీలయొక్క ప్రేమను అవకాశంగా తీసికొని, ఎవరూ భారంగా ఉండకోరలేదు. వారు నిజంగా సహాయం చేయనిష్టపడినప్పుడు, దాన్ని అంగీకరింపకుండేలా గర్వాన్ని అడ్డురానియ్యలేదు.

అపొస్తలుల కార్యగ్రంథం గుండా వెళ్లేటప్పుడు, అందులో ఉన్న పాత్రలనుగూర్చి ప్రసంగించవచ్చు. బర్నబా ఒక విషయంలో తప్పు (గలతీ. 2:13), అతడు అన్నివేళలా బహు ఆదర్శమైన వ్యక్తిగా, యితరులను ప్రోత్సయించడంలో కన్పిస్తాడు. అతడే తప్పునుకొంటావో, లేదా ఈ సందర్భంలో, పౌలే తప్పునుకొంటావో గాని 15:36-39, హెచ్చరిక పుత్రుడు అనే తన పేరుకు తగినట్టు అతడు నిలిచియున్నాడు. నీవు ఉపయోగించుకొనడానికి కొన్ని లేఖనభాగాలు యిక్కడ యివ్వబడ్డాయి: అపొ. 9:26-28; 11:22, 24-26, 30; 12:25; 14:4, 14; 15:2, 5, 12, 36-41;

1 కొరింథీ. 9:6; గలతీ. 2:1, 9, 13; కొలస్సీ. 4:10.

''పాపాన్ని గట్టిగా తీసికొన నేర్చుకో'' అనే దానిమీద అననీయ సప్పీరాల కథనాన్ని ఉపయోగించి, శక్తివంతమైన ప్రసంగం చేయవచ్చు. లేఖనంలోని తక్కిన భాగాలను పరిచయానికి ముగింపుకు ఉపయోగించుకోవచ్చు. దీన్ని యెహోషువ 7, ఆకాను కథనానికి సమాంతరంగా చూపడానికి ప్రయత్నించవచ్చు (అపో. 5). నీవు ఇది చేసినట్లయితే, యాకోబు 1:14-15లను ఆకానుతో పోల్చిచూపవచ్చు. ఇంకో రూపంలో దీన్ని ప్రయోగించాలంటే - ''మరణం సంఘం దగ్గరకు వెళ్లింది''! అనే పేరుతో ప్రసంగించవచ్చు. ఆరాధన సమయాల్లో గుండెపోటువచ్చి పడిపోయినవారిని నేనెరుగుదును; ప్రసంగిస్తూ ఉండగానే వేదికమీద సువార్తికులు కూలిపోయిన వారిని నేనెరుగుదును. అయితే (నాకు తెలిసినంతమట్టుకు) దేవునిచే మొత్తబడిన వానిని నేనెన్నడూ చూడలేదు-నేనెన్నడు చూడబోనని నిరీక్షిస్తున్నాను.

---

సూచనలు

[1]''ప్రేమవిందులు'' అనేది *agapais* అనే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది. *Agape* అనేది ''ప్రేమకు'' క్రొత్త నిబంధన పదం - దీనికి బహువచన రూపమే - *agapais* అనేది! ''ప్రేమ'' (లు) అనే (నామవాచక) భావాన్ని యిది యిస్తుంది. అయితే, ఆది క్రైస్తవులు అనుభవించే సహవాస భోజనాలను సూచించడానికి ఆ పదం వాడబడింది. [2]అపో. 2:46. కొరింథీయులు ''ప్రేమవిందును'' ప్రభురాత్రి భోజనంతో కలిపి, కడకు వారు ఆ రెండింటిని చెరిపి వేసినట్లు ఎక్కువమంది రచయితలు భావిస్తున్నారు (1 కొరింథీ. 11). [3]నా చిన్న తనంలో - అవి వండకముందు స్పింటో బీన్స్ వేరుచేసే పని నాకు పెట్టబడేది. అందులో నేనంత జాగ్రత్తగా ఉండేవాడను కాను. [4]నీవు సముద్రతీర ప్రాంతాన జీవిస్తుంటే - నీ శ్రోతలకు ఎరుకైన ఉదాహరణలను వాడుకోవచ్చు. [5]"Ship" అనే మాటమీద ఆటలాడే సరదా నీకుంటే క్రైస్తవ్యానికి సంబంధించి - fellow*ship*, partner*ship*, wor*ship*, leader*ship*, steward*ship* మొదలైనవి ఉపయోగించవచ్చు. [6]దురదృష్టవశాత్తు, ఆది శిష్యులకు ఉన్న ఐక్యత కాలక్రమంలో కొనసాగలేదు (1 కొరింథీ. 1:10-13). [7]అపో. 2:46లో వారు ''ఏక మనస్సుగలవారైయుండిరి అని చెప్పబడింది. వారి ఐక్యత కేవలం పైపైన కన్పించేది మాత్రమే గాక, అంతరంగంలోనుండి అది ఉద్భవించినట్లుంది. వారిలో యిద్దరి మనస్సులే తక్కిన క్రైస్తవులతో అతుకబడనట్లున్నాయి (అపో 5లో-అననీయ, సప్పీరా అనేవారు). [8]''సమాజం'' అనే పదం - *Plethos* అనే పదానికి తర్జుమాగా వాడబడింది. అనేక తర్జుమాల్లో ''జనసమూహం'' అని ఉంది. (KJV, NKJV, ASV). RSV మాత్రం ''సహచర్యం'' అనే పదాన్ని వాడింది. *Plethos* అనే పదాన్ని NASB ఈ విధంగా తర్జుమా చేయడంలో (యూదులు - క్రైస్తవుల) సమాజంలో యిలాటి ప్రత్యేకమైన భావం పొందింది గనుకనే (F. F. Bruce, *The Book of the Acts,* The New International Commentary on New Testament, rev. ed. [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988], 100). [9]యెరూషలేములో ఎల్లప్పుడు పరిస్థితి అలాగే లేదు (రోమా 15:26). ఇది కొద్దికాలపు సంభవమే. [10]రెండేండ్ల నా మనుమరాలుతో వాదం పెట్టుకోవాలంటే - ''ఇది నాది'' అంటే చాలు. తాను రొమ్ముచరచుకొని ఈ ''జోళ్లు'' నావి అని అంటుంది.

[11]అపో. 2:44-45పై గత సంచికలోని నోట్సును చూడు. [12]అపో. 12లో యోహాను (మార్కు) తల్లియైన మరియకు యెరూషలేములో సొంత యిల్లున్నట్లుంది (12-13 వచనాలు). [13]అసలు ఆ అమ్మకం ఎలా జరిగిందనే విషయం లూకా ఉద్దేశానికి అప్రస్తుతం; క్రైస్తవుల స్వార్థరాహిత్య విధానమే తన ఉద్దేశంగా కన్పిస్తుంది. [14]ప్రత్యక్ష గుడార నిర్మాణ విషయంలో కూడా యిలా స్వేచ్ఛార్పణల పద్ధతియే వినియోగించబడింది (నిర్గమ. 36:5-7). [15]సంఘ ధననిధిని గూర్చి క్రొత్త నిబంధనకు సంబంధించి యిచ్చిన సూచనల్లో యిది యొకటి. [16]అవసరతలో ఉన్నవారి అక్కరలు తీర్చడానికి-సంఘ కానుకలు వినియోగింపబడుతున్నాయి గనుక ఆస్తులు అమ్మే ప్రశక్తి రాలేదు. అపో. 2, 4ల్లోని త్యాగపూరితమైన కార్యం మీమధ్య జరుగలేదు. [17]''కృప'' అనే పదం *charis* అనే గ్రీకు మూలంనుండి

వచ్చింది. అది దేవుని దయకు,మనుష్యుల దయకు సహితం వర్తిస్తుంది (లూకా 2:52 అది రెండు విధాలుగా ఉపయోగింపబడింది). ఎక్కువ మంది తర్జుమాదారులు దేవుని దయను లూకా సూచించినట్లు భావించారు. నా మనస్సులోనైతే, అపొ. 2 అంతం, అపొ. 4 అంతానికి చాల సమాన భావాలు కన్పిస్తున్నాయి గనుక - మనుష్యుల దయను అది సూచిస్తున్నట్లు - మొగ్గుచూపుతుంది. [18]KJVలో "Joses" - అని ఉంది. ఇది Joseph అనే హెబ్రీకి గ్రీకు రూపం. KJV పాతనిబంధన పేర్లకు సాధారణంగా గ్రీకు రూపాలనే యిస్తుంది. [19]బర్నబా - కుప్ర (Cyprus) అనే ద్వీపంలో జన్మించాడు. ఇది మధ్యదరా సముద్రములో - ఉత్తర -తూర్పు దిశలకు మధ్యగా ఉంటుంది (consult a map). క్రూరమైన హింస, ఆర్థిక ఆవస్యకతలను బట్టి యూదులు చెల్లాచెదురైయున్నారు. [20]అతడు తాను అమ్మిన వెలయంతా తెచ్చి ''అపొస్తలుల పాదాలయొద్ద పెట్టాడు''.

[21]''అపొస్తలుల పాదములవద్ద'' అనే పదప్రయోగం బారుకీ కన్పిస్తుంది. అది కేవలం స్థలాన్ని సూచించడం మాత్రమే కాదు: మరి ముఖ్యంగా అది వారి స్వాధీనంలో ఉంచారనే భావాన్ని సూచిస్తుంది. (విద్యార్థులు ఉపాధ్యాయుని పాదాలవద్ద కూర్చుంటారనేది - వారి విధేయతను సూచిస్తుంది). బర్నబా తన డబ్బును అపొస్తలుల పాదాలవద్ద పెట్టాడు; అలాగే అననీయ కూడ (4:37; 5:2). సప్పీరా పేతురు పాదములవద్ద పడి చనిపోయింది (5:10). [22]"Son of" అనే హెబ్రీమాటకు స్వభావంలో ''పాలుకలిగి యుండుట'' - అనే భావం ఉంది. [23]NKJV, RSV, NASB. ''ఉత్సాహ పుత్రుడు''బర్నబా అనే దానికి అర్థం అంటే- భాషా పండితులకు సమస్యగా ఉందికాని, లూకా మాత్రం- ఆ పేరుకు అర్థం అదేనని చెప్పాడు. [24]KJV. [25]The New Testament in Basic English. [26]ASV, NEB.''పోత్సాహం'' అని తర్జుమా చేయబడిన పదం - ఆదరించు, ఓదార్చు, హెచ్చరించు అని తర్జుమా చేయవచ్చు. అవి ఒకదానితో ఒకటి సంబంధం కలిగినవే. [27]సంఖ్యా. 18:20-21, 24; 35:1-8; యెహోషువ 21:41. [28]లేవీయులు భూమిని సంపాదించుకోవచ్చా? అనే విషయంలో పండితులు తంటాలు పడుతున్నారు. అయితే యిర్మీయా లేవీయులకు సంబంధించినవాడే (యిర్మీయా 1:1); అతనికి సొంతమైన భూమియున్నట్లు కన్పిస్తుంది (యిర్మీయా 32:6-15). [29]ప్రతి శ్రేష్టమైన దానికి నకిలీ ఉండనే ఉంటుంది. [30]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary*, vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 423లో ఈ భావన సూచింపబడింది.

[31]అననీయ సప్పీరాల చర్యను, సాధారణంగా ఆ స్థానిక సంఘం జరిగించిన చర్యకు, అందులో ప్రత్యేకంగా, బర్నబా చర్యకుగల తారతమ్యాన్ని పోల్చిచూడవచ్చు. [32]వారు అమ్మినది పొలమని 3వ వచనం చెప్పుతుంది. [33]''వేషధారి'' అంటే - ''క్రిందనుండి బదులిచ్చు, లేక సమాధానం చెప్పు'' - అనే అర్థం. ఇలాటి అర్థం యిచ్చే సంయుక్త గ్రీకు పదంనుండి - వేషధారి అనే మాట వచ్చింది. ''క్రింద'' అనేది - (ముఖానికి) వేసికొనే ముసుకు క్రింద ఉన్న వ్యక్తిని సూచిస్తుంది. [34]Victor Loyd అనే తోటి సువార్తికుడు - ఈ వ్యవహారంవలన వారు భౌతిక లాభాన్ని పొంద నిరీక్షించినట్లు ఆలోచిస్తున్నాడు అంటే - తమకున్నదంతా అమ్మినట్లు నటించడంవల్ల, సంఘంవద్దనుండి సహాయం పొందేలా - ధర్మదాతల పట్టీలో తాము చేర్చబడ నిరీక్షించినట్లు- తాను భావిస్తాడు. [35]"*Who said?" Page-a-Day Calendar* (New York, Workman Publishing Co., 1994), December 22. [36]Wiersbe, 421. [37]ఆ పొలంయొక్క వెలకు కుడియెడంగా ఉన్నంత సొమ్ము అయ్యున్నట్లయితే అతని తంత్రం చెల్లేదేనని Jimmy Allen అభిప్రాయపడుతున్నాడు, (దాని వెల పెద్ద మొత్తమైయున్నట్లు అతడు భావిస్తున్నాడు (Jimmy Allen, Survey of Acts, vol. 1 [Searcy, Ark.: By the Author, 1986] 58. [38]సొలొమోను మంటప సమీపంలో - (అపొ. 5:12), ఉన్న ఏదో ఒక అపార్టుమెంటులో వారు ఉండియుండవచ్చు. ఆ స్థలం ఎక్కడైయున్నా, దానికి ద్వారం ఉంది (9 వ.). [39]అననీయ హృదయంలోనికి చూడగలిగే ఆత్మవరమే పేతురుకు ఆ సామర్థ్యం కల్గించిందో, లేక పరిశుద్ధాత్మయే పేతురుద్వారా పలికి, అననీయ పాపాన్ని బయటపెట్టాడో మనకు తెలియదు. [40]సాతాను అంటే - ''విరోధి'' అని భావం - క్రొత్త నిబంధనలో ఈ పదం - అపవాదికి నామకరణంగా వినియోగింపబడింది.

[41]''అపవాది నన్ను ఈ పనిచేయించాడని'' (కొన్నిసార్లు తమాషాగా) అంటారు. అయితే మనం చేయనుద్దేశించనివేవీ అపవాది నేడు మనచే చేయించలేడని గ్రహించాలి! [42]క్రైస్తవులు జాతకాలు చూపించుకొనడంలో, Ouija Boards వద్ద నిలిచేటప్పుడు నాకు వ్యాకులతగా ఉంటుంది. అపవాదినుండి, వాని పాదపీఠంనుండి ఎంతదూరంగా తొలిగి ఉండాలో, అంత దూరంగా మనం తొలిగియుండు! [43]ఇంగ్లీషుభాషలో "ellipsis" అనేది ఒక అలంకారం- మాటలు కొన్ని పలుకకుండానే భావాన్ని స్ఫురింపజేసే అలంకారమది. [44]3వ వచనంలో అననీయ పరిశుద్ధాత్మతో అబద్ధమాడినట్లు తెలిపాడు; 4వ వచనంలోనేమో - దేవునితో అబద్ధమాడినట్లు అన్నాడు. తమ మధ్యనున్న దేవుడు అన్నట్లు ఆది సంఘం పరిశుద్ధాత్మను గుర్తించింది. [45]ఒక పని యితరులను బాధింపనంతవరకు, దాన్ని చేయవచ్చునని కొందరు వాదిస్తారు. చేయవద్దని దేవుడే ఆజ్ఞాపించినట్లయితే, మనం అవిధేయులమైనప్పుడు,

అది ఆయన్ను బాధిస్తుంది - యితరులను అది బాధించినా బాధించకపోయినా! [46]బలమైన కలవరాన్ని వ్యక్తపరచడానికి ఉపయోగించే వర్ణనయిది. [47]అననీయ, సప్పీరాల మరణానికి కారణం దేవుడే కాని పేతురు కాదు; అలా కాకపోయినట్లయితే, పేతురుమీద హత్యానేరం వచ్చియుండేదే (J. W. McGarvey, *New Commentary on Acts of Apostles*, vol. 1 [Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.], 86). [48]KJV ''ఆత్మను విడిచెను'' అని ఈ పదాన్ని తర్జుమాచేసింది. [49]క్రొత్తనిబంధన - ''ప్రాణము విడిచెను'' అని అన్నప్పుడు - గ్రీకులో పలుమాటలు ప్రయోగించబడ్డాయి. [50]అపొస్తులులపై ప్రజలకున్న గౌరవం కూడా పెరిగింది! అపొ. 5:13 యొక్క అర్థంలో కొంతభాగం దీనికి సంబంధించింది కావచ్చు?).

[51]పేతురును, లేదా దేవుని నిందించేవారు- తాను చంపబడకముందు అననీయకు మారుమనస్సుపొందే అవకాశం యివ్వబడలేదంటారు. (లూకా సహజమైనట్లు) క్లుప్తీకరించబడిన సమాచారమే యివ్వబడింది. ఏమి చెప్పాడో, ఏమి చేశాడో మనకు తెలియదు, అననీయకు మారుమనస్సుపొందే అవకాశం ఒకవేళ యివ్వబడకయుంటే- అతడు మారుమనస్సు పొందే స్థితిలో ఉన్నది, లేనిది దేవుడు అతని హృదయాన్ని ఎరుగును గనుక సమస్యలేదు (హెబ్రీ. 6:4-6). ''ఎలా విమర్శించాలో మనం ఎరిగిన దానికన్న, తన లోకాన్ని ఎలా నడిపించుకోవాలో దేవుడు బాగా ఎరుగును'' (Anthony Lee Ash, *The Acts of the Apostles*, part 1, The Living Word Commentary [Austin, Tex.: Sweet Publishing Co., 1979], 84). [52]దేవుడు కావాలనుకొంటే - ''ప్రకృతి సిద్ధమైన'' విధానాన్ని ఉపయోగించకోవచ్చు. హేరోదును పురుగులుపడి చచ్చేలా చేసినప్పుడు, ఆయన అననీయ, సప్పీరాలను ''గుండె ఆగిపోయేలా'' చేయగలరు. [53]ఇశ్రాయేలీయులలోనుండి అక్రమంగా పెరిగిన పాపంయొక్క అపాయాన్ని కత్తిరించవలసివచ్చింది. కేన్సర్‌లో జబ్బుపడిన భాగాలు మాత్రమే గాక, దానినంటియున్న భాగాన్నికూడా తుంచివేయునట్టు - ఈ కార్యం జరిగింది. [54]ఈ యౌవనస్తులెవరో మనకు తెలియదు. ఈ సంఘటన అపొస్తులుల సమక్షంలో రహస్యంగా జరిగింది గాక, కొంతవరకు యిది బహిరంగంలోనే జరిగినట్టు ఈ పడుచువారి ప్రసన్నత సూచిస్తుంది. ''పడుచువారిమీద'' పెట్టబడిన, లేక పడుచువారికి అప్పగింపబడిన ఈ పనిని బట్టి - కొన్ని కార్యాలు ముసలివారికంటే (బరువులు మోసకొనిపోవడం, గుంట త్రవ్వడం లాటివి) పడుచువారే సామర్థ్యంగా చేయగలరు. ప్రతివారికి ఆయా వయస్సులో అప్పగించడానికి దేవునికి పని ఉంది - అని దీనివలన మనకు తెలుస్తుంది. [55]అక్షరార్థంగా ''బట్టతోచుట్టి'' అని అర్థం. ఇది తొందరపడిచేసే భూస్థాపనను సూచిస్తుంది (**KJV**లో అన్నట్టు) ఆ మృతదేహాన్ని సమాధి వస్త్రాలతో చుట్టబడియుండవచ్చు. ఈ పని రహస్యంగా, సప్పీరా వచ్చేవరకు మరుగుగా ఉండాలని ఉద్దేశంతో తొందరగా చేసియుండవచ్చు. [56]భూస్థాపనకు సంబంధించిన కార్యకలాపాలు నేడు జరిగే దానికంటే అధికంగానే ఆనాడు ఉండేయి. [57]నాదాబు, అబీహులకు తండ్రియైన అహరోను తన కుమారుల మరణ విషయంలో దుఃఖించడానికిగాని, వారి భూస్థాపనకు వెళ్లడానికిగాని అనుమతింపబడలేదు. [58]ఇతర దృశ్యాలుకూడా సాధ్యమే. తాను మొదటిగా వచ్చి తొలి ఘనతను పొందడం - ఆమె ఆ తరువాత వచ్చి మిగిలిన ఘనతను పొందాలనే భావనకూడా ఉండి ఉండవచ్చు. సంగతులు చెప్పబడ్డ వరుస క్రమాన్ని చూస్తుంటే యిలా అయినట్టు కన్పిస్తాయి. [59]ఆ విషయం ఎవరికీ చెప్పకూడదనే నిషేధాజ్ఞ విధింపబడక యున్నట్టయితే, సప్పీరాకు ఆ సంగతి ఎలా తెలియకుండా ఉండేదో. [60]నీవు ఏవైపునుండి చూచినా, ఆశ్చర్యకరంగానే ఉంది! మనుష్యులు ముచ్చట్లకు పడిచస్తారు గదా! అలాటప్పుడు ఈ సమాచారం వ్యాపించక పోవడమే ''కార్యగ్రంథంయొక్క అద్భుతమని'' నేను తమాషాగా అంటూ ఉంటాను. బైబిలు విమర్శకులు దీన్ని ''అసాధ్యం'' అని అంటారు. అయితే ఆనాటి వారి సాక్ష్యాన్ని నేను అంగీకరిస్తాను.

[61]ఒకవేళ పేతురు అలాటి నిషేధాన్ని విధించియున్నట్టయితే, అతని భావన ఉత్తమమైనదైయుండాలి. తన చర్యలలో ఉత్తమమైన దాన్ని జరిగించాలని ప్రేమ కోరుతుంది (1 కొరింథీ. 13:7). పేతురు ఆమెకు ఉరి యొడ్డాడంటే మాత్రం, పేతురు తగని పనిని చేసియున్నట్టే. [62]ఈ అమ్మకంలో సప్పీరాయొక్క పాలు, ''మీరు భూమిని అమ్మితిరి'' అనే పదాలను బట్టి - ఆ భూమి అననీయకు కాక, సప్పీరాకే చెందినట్టు కొందరు ఊహించారు. [63]వెల అని పేతురు ప్రస్తావించినది, అననీయ అమ్మినట్టు చెప్పిన వెలయే. [64]ఆత్మయొక్క సంక్షిప్త వార్తలను లూకా మనకు యిస్తున్నాడు. మనం ఎంతవరకు తెలిసికోవాలో అంతకంటే ఎక్కువగా యివ్వడంలేదు. [65]ఈ తప్పుకు మాదిరియైన ఏకీభావం; ఇది దేవుని చిత్తానికి విరోధంగా జరిగిన ఏకీభావం (ఆమోసు 3:3; **KJV**లో చూడు). ఏకత్వం ప్రాముఖ్యమయ్యిందే (యోహాను 17:20-23). అయితే దేవునికి విధేయత చూపడం అతిప్రాముఖ్యం (మత్తయి 10:34). [66]''పరీక్షించుట'' అనడానికి వినియోగింపబడిన గ్రీకు పదానికి - శోధించుట అనే అర్థంకూడా వస్తుంది (**KJV**ని చూడు). ఇంగ్లీషులో **tempt** ''అనే పదం'' తప్పుచేసేలా శోధించడం అనే భావాన్ని సూచిస్తుంది, దేవుడు శోధింపబడడు (''కీడు విషయమై'' యాకోబు 1:13), గనుక, ఈ సందర్భంలో ''పరీక్షింపబడుట'' అనేది యుక్తంగా ఉంటుంది. [67]భర్త భార్యను పరీక్షించాలని భావించినప్పుడు, అతడు ఆమెను నమ్మినందున ఆ పని చేయడు, నమ్మకపోవడం

వల్లనే ఆ పని చేస్తాడు. [68]Burton Coffman - ఈలాటి వ్యవహారం బహిరంగంగా చూపబడవలసిందిగా బర్టన్ కాఫ్‌మన్ నమ్ముతాడు (Coffman 103). ఇలాటి వాస్తవాలు తెలియజేయబడుతూ ఉంటాయి (సంఖ్యా. 32:23). [69]Lewis Foster, notes on Acts, *The NIV Study Bible* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1652. [70]పాదములయొక్క చప్పుడు తనకు పరిచయమైనా అయ్యుండాలి; లేక వారు అక్కడకు వచ్చినట్లు పరిశుద్ధాత్మయైనా తెలిపియుండాలి. సమాధిచేసి రావడానికి మూడు గంటలు పట్టినట్లుంది.

[71]ఇద్దరికి దాదాపుగా గుండె ఆగిపోయి ఉండాలి - అయినా ఆ కార్యంలో దేవుని హస్తం ఉంది. [72] తాను ఆ మాటలు పలికేటప్పుడు పేతురు యింకా పరిశుద్ధాత్మచేత నడిపింపబడుతునే ఉన్నాడు. [73]5వ వచనంలో కన్పించిన పదప్రయోగం యిదే. సప్పీరా మీదకి వచ్చింది. దేవుని తీర్పే అని యిది నొక్కి చెప్పుతుంది (5, వచనంపై నోట్సు చూడు). [74]Richard F. Weymouth, *The New Testament in Modern Speech*. [75]William F. Beck, *The New Testament in the Language of Today*. [76]అపొ. 2:47 - KJVలో ''సంఘం'' అనే పదం ప్రయోగింపబడింది. అయితే మేలైన చేతి ప్రతులలో *ekklesia* అనే పదప్రయోగం లేదు. 2:47 నోట్సులో చూడు). అపొ. 5:11లో తొలిసారిగా ''సంఘం'' అనే పదం నిరాక్షేపంగా ప్రయోగింపబడింది. [77]కార్యగ్రంథంలో ఇరవై మూడు రూపాలుగా ఈ పదం ప్రయోగింపబడింది. [78]*ek* (out) + *kaleo* (to call). Septuagintలో ఈ పదం ప్రయోగింపబడినందున కొందరు, ఈ అర్థాన్ని సవ్వాలు చేస్తారు. అయినా, ఇదే ఆ పదంయొక్క మూలార్థమని నేను నమ్ముతున్నాను. [79]Glossaryలో ''సంఘం'' అనే పదాన్ని చూడు. [80]అరణ్యంలో ఉన్న ఇశ్రాయేలీయులను సూచించడానికి కూడా ఈ పదం ఒకసారి ప్రయోగింపబడింది (అపొ. 7:38).

[81]సంఘం అనే పదం - క్రైస్తవులకూడికకు - ''కూడిక'' అనే భావంలో ఉపయోగింపవచ్చు (కొరింథీ. 14:23). [82]దేవునియొద్ద దొంగలగుటనుగూర్చి ప్రవక్తయైన మలాకీ తెలియజేశాడు (మలాకీ 3:8). [83]"You Can't Hide Those Lying Eyes" అనే ప్రసంగాన్ని - Rick Atchley, Southern Hills church of Christ, Abilene, Texas,లో January 27, 1985, చేశాడు. దానినుండి ఈ విషయం సేకరించబడింది. [84](హత్య, లైంగిక పాపం, వగైరాలు) భౌతికమైన మరణాన్ని తేవచ్చు. అయితే తీర్పుదినం వరకు అనేక పాప ఫలితాలు నేడు కన్పించడంలేదు. [85]Collinsville, Oklahoma,లోని సంఘ పెద్దలకు వ్యతిరేకంగా కోర్టుకేసు బాగా ఎరుకైనదే! [86]1 కొరింథీ. 5:5, 9, 11, 13; 2 థెస్స. 3:6. [87]అపొస్తలులద్వారా సూచకక్రియలు, మహాత్కార్యాలు చేయబడు తున్నట్లు లేఖనం నొక్కి చెప్పుతుంది. ఇంతటి ఘనత ఆ శక్తి మరెవ్వరికి యివ్వబడినట్లులేదు. ''ప్రత్యేకించి అపొస్తలుల చేతులద్వారానే సూచక క్రియలు జరుగుచున్నందున అపొస్తలుల అధికారం గొప్పగా బలపరచబడిందని'' A. C. Hervey అనడం సరిగా ఉంది. (A. C. Hervey, Pulpit Commentary, vol. 18 [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950, 158). [88]ఇది యెరూషలేములో క్రైస్తవుల సహజకూడికస్థలంగా ఉన్నట్లుంది. (అపొ. 3:11కూడా చూడు). [89]తొలి చూపులో, ఈ వచనాలు పరస్పర విరుద్ధాలన్నట్లు కన్పిస్తాయి. ''కడమవారిలో'' అనే పదం వద్ద వాఖ్యాన కర్తలందరు ఏకీభవించలేదు. అయితే లేఖన భావం తేటగానే ఉంది. అననీయ సప్పీరాలకు సంభవించిన దానిలో కొందరు నిరాశచెందినా, మొత్తంమీద అది సంఘాభివృద్ధికి తోడ్పడింది. [90]గతంలో సంఘంలో స్త్రీలు ఉన్నా, ఇక్కడ ప్రత్యేకించి స్త్రీలు క్రైస్తవులయిన సంగతి ప్రత్యేకంగా గుర్తించబడింది. ఇంతక మునుపు ఒక స్త్రీ ప్రత్యేకంగా సూచించబడింది - ఆమె సప్పీరా.

[91]ప్రతి వారి అక్కరలు తీర్చబడుతున్నప్పుడు, ఇది ఒక శోధనగా ఉంటుంది. కొందరు యింకా సంఘంతో కలిసిపోయే శోధనలోనే పడియున్నారా - ప్రత్యేకించి సంఘం తనవారి అవసరతలు తీర్చడం చూచినప్పుడు! [92]''కలయుట'' అనే పదానికి అక్షరార్థం ''కలిసియుండటం'' ఏదో ఒక సమూహంలో కలిసిపోయినను ఈ పదం వర్తిస్తుంది. [93]''కడమవారు'' అనగానే సంఘంలో మిగిలిన సభ్యులని కొందరనుకొంటారు. వారు అపొస్తలులనుండి తమ్మునుతాము ఎడంగా ఉంచుకొంటున్నవారట. ''కడమవారు'' అంటే - సంఘాన్ని విసర్జించి, క్రీస్తుకు శత్రువులైనవారని మరి కొందరనుకొంటారు. KJVలో సూచించినట్లు - కలిసియుండటమనే దానిలో జతకూడి యుండుటమనే భావం గోచరిస్తుంది. సంఘంతో ''చేర్చబడటం'' సంఘంతో కలిసియుండటం అనే వాటిమధ్య భేదంవుందని నేను నమ్ముతాను (14 వ.). (అపొ. 2:47కూడా చూడు).[94]అననీయ సప్పీరాలు నిజంగా క్రైస్తవులేనా? వారు రక్షింపబడ్డారా? నశించారా? అనే ఆలోచనలలో వ్యాఖ్యానకర్తలు సతమతమౌతున్నారు. అననీయ సప్పీరాలు క్రైస్తవులు, సంఘసభ్యులు కాదనడానికి నాకు ఏ కారణం కన్పించదు. క్రమశిక్షణ అనేది సంఘ సభ్యులకే తప్ప సంఘం వెలుపలనున్న వారికి వర్తించదు (1 కొరింథీ. 5:9-11). పైగా వారిలో ఏ ఒక్కరుకుడా మారుమనస్సు పొందినట్లులేదు. గనుక ఈ జీవితానంతరం వారికి ఏ నిరీక్షణయున్నట్లు లేఖనంలో కన్పించదు. ఇక్కడ సంఘటనలో అది ప్రాముఖ్యమైన సంగతికాదు. ''దేవుడే తీర్పరి'' అని మామూలుగా అంటాం కదా? (దాన్ని మనం వదలివేద్దాం).